కదంబుని సాహసము

శ్రీమతి ఆదుర్తి సత్యాబాయిగారు

ఆ పెద్దబుర్రా, దొంగచూపులూ, బొర్రకడుపూ, మరగుజ్జుశరీరమూ ఎవరూచూసినా యీవ్యక్తికింత మహోన్నతపదవి ఎలాగువచ్చింది బాబూ అనుకునితీరాలి. పెద్దబుర్రనిండాఉన్నది మట్టిముద్దేఅయినా పాదుషావారి నిర్హేతుకజాయమానకటాక్షమువల్ల రహమాన్‌ఖాను నవనగరద్వీపానికి రాజప్రతినిధి అవగలిగేడు. గుడ్డిలో మెల్లన్నట్లు ఈ పెద్దబుర్రసాయిబుగారిని ప్రధానరాజ్యభాగంలో గాకుండా ఏఅందుబాటులేని మారుమూలనున్న ఈద్వీపంలో వేసినందుకు పాదుషావారిని మెచ్చుకోవలసినదే. గుర్రం గుడ్డిదైనా దానాకి లోటులేదు. ఖాను సహజంగా పిరికిపందఅయినా తలకుమించినగర్వం. దానికితోడు అధికారబలం. అదేనా పాదుషాకందుబాటులేని దూరస్థలంలో. ఇక చెప్పేదేముంది? తనే సర్వాధికారిలాగ చలాయిస్తున్నాడు. దురభిమానము పెరిగిపోయినది. ఆడంబరానికి మితి అగుపడడమే లేదు.

ఒకవాడు ఛత్రాజులకీడుదియ్యాని అంతరంగికమిత్రులు నిజప్రభావం పొగడుతూఉంటే నాగస్వరం వింటున్న పాములాగ పొంగిపోతున్నాడు అయ్యా. ప్రస్తుతకారణం ఏమంటే ఈమధ్యనే కొంతమంది ధైర్యవంతులైన నవనగరనావికులు ఓడదొంగలరాయడయిన కదంబుని ముఖ్యపరిచరులను బంధించి ఈతని కప్పగించేరు. తానే యీసాహసంచేసినట్లు పొంగిపోతున్నాడు ఖాను. ఇటువంటి మహాసమయంలో వచ్చేడు దర్వాజీ. "పాదుషావద్దనుండి వార్తావహుడు వచ్చినాడు ప్రవేశపెట్టుటకుశెలవా"అన్నాడు. 'పాదుషా-వార్తావహుడు' అన్నముక్కలు చెవిని పడేసరికి ఖానుముఖంలో చిక్కినా నెత్తురులేదు. ప్రభువువద్దనుండి వార్తవస్తే సంతోషించాలో భయపడాలోకూడా అతనికి తోచలేదు. తోచేది, మానేది కాని పాదుషాపంపిన మనిషి వద్దడానికి వీలా? ఖాను తలా? "సరే రమ్మనుమ"న్నాడు గద్గదికతోటి. ముఖ్యమిత్రుడొక్కనికితప్ప మిగిలిన అందరకూ శెలవిచ్చిపంపివేసినాడు. ఇంతలో అపురూపసుందరుడైన ఒకపురుషుని దర్వాజీ గదిలోనికి ప్రవేశపెట్టేడు. అనూతనపురుషుని విశాలమైననుదురూ, ఆకర్ణాంతములైన కళ్ళూ, ఎటువంటివాళ్ళయినా అరక్షణంలో వశపరచుకోగల దృష్టులూ, తీర్చిదిద్దినట్లున్న చక్కని అవయవములూ, ధరించిన విలువైన అంగరకా, ముఖమలుపనిచేసిన పాదరక్షలూ, రత్నముఅమర్చిన బంగరుపిడి పైకగుపడేటట్లుగా దట్టిలో నిమిడ్చిన బాకూ అతడొక ఉన్నతవంశజుడైన గొప్ప రాజకీయోద్యోగియని చెప్పవక్కరలేకుండానే తెలుస్తున్నాది. ఖానుసముఖానికి రాగానే అతడు తలపాగాలోనితురాయి నేలకు తగిలేటట్లుగావంగి "అల్లా కీర్తింపబడుగాక! పాదుషావారు వకానొక అగత్యమైన కార్యముపై మీవద్దకంపినారు. మీకు వీలైనయడల మనవిచేసెదను"అన్నాడు.

ఖాను కేంచెయ్యాలోకూడా తోచలేదు. నిలువుగ్రుడ్లతో అతడిని ఒకసోఫాపైకి ఆహ్వానించేడు. తరువాత నీళ్ళునములుతూ జగన్మోహనమైన అతనిరూపముచూస్తూకూర్చున్నాడు.ఎట్టకేలకు "మీనామధేయము?" అన్నమాట లాతనినోటిలోంచి ఊడిపడ్డాయి. ఆగంతకుడు చిఱునగవుతో "అబ్దుల్‌గనీ"అన్నాడు.

"(ఆశ్చర్యముతో) గనీ......గనీయా?"

"అవును. ఆశ్చర్యమేల? నేను మీయర్థాంగి హమీదాబేగమున కొకవిధముగ అన్నదమ్ముడనే."

ఈమాటవినేసరికి ఖానుకళ్ళలో భయం మాయమయింది. ఆస్థానంలో తనభార్యయందుగల నిరసత్వమూ, ఆమె బంధువులయందు అసూయ తాండవించేయి. గనీ కిది కష్టమనిపించింది. "అయ్యో! అది యిప్పుడప్రస్తుతముకదా? నేను వచ్చినపని జరుగుట కనుజ్ఞనీయురా" అన్నాడు. ఖాను చకితుడై "అవశ్యము. పాదుషావారి ఆజ్ఞనందుకొనుట ప్రధానకర్తవ్యముకదా" అని సరిపుచ్చుకున్నాడు.

1029

గనీ ఉపోద్ఘాతము ప్రారంభించేడు. "దేశమును వదలి యిచ్చటకు వచ్చేలోపల నేను చాలా అవస్థలు పడినాను. దారిలో మాయోడ నష్టమైపోయింది. చావుదప్పి కన్ను లొట్టపోయినట్లు నేనుమాత్రం అల్లా దయవల్ల మీవద్దకు రాగలిగేను."

"మీయోడ ఎందుకు భగ్నమయింది?"

"పిమ్మట అది సావధానంగా మనవిచేస్తా. ముందు పాదుషావారి పని కానీయండి. మీరు దేశాని కొనర్చిన సేవలువిని పాదుషావారు చాలాసంతోషించి తమ జన్మదినోత్సవసమయమున మీకీబిరుదము నిచ్చుట కిచ్చగించినారు. కాని ఇప్పుడు చెప్పిన కారణములవల్ల సముద్రము తాకుడు కీబిరుదుపత్రము నలిగిపోయింది. దైవకృతమైన ఈతప్పిదమునకు నన్ను క్షమింతురుగాక" అని చెబుతూ బాగాతడిసి ముడతలుపడిపోయిన ఒక కాయితాన్ని ఖాను చేతుల్లో పెట్టేడు. వర్ణింపలేనన్ని ఆలోచనలతో ఆకాయితం విప్పి క్షణంలో అమూలా గ్రంగా చూసేశాడు. నిజంగా అది బిరుదుపత్రమే. కాని నీటితాకుడువల్ల కాబోలు తనపేరూ, పట్టణనామమూ ఏర్పించడానికి వీలులేనిస్థితిలో ఉన్నాయి. ఇంతలో అంగరకాలోని జేబునుండి ఒకతోలుపెట్టె తీసి విప్పి నాడు గనీ. అందులోంచి గదంతా కాంతులతో నింపుచున్న రత్నాలతో పొదగబడిన బిరుదుచిహ్నం బయట పడింది. ఇదవుపడేసరికల్లా ఖానుగారిబుర్ర ఖాళీఅయిపోయింది. సంశయాలన్నీ సమసిపోయాయి. తనకోసమే కాకపోతే ఇన్నికష్టాలుపడి ఇంతదూరంవచ్చి పాదుషాకోపమునకు పాత్రుడై గనీ తనకెందుకు దీనినిస్తాడుఅని మనను సమాధానంచెప్పింది. సంతోషము చేవణకుచున్న చేతుల్తో దాన్నందుకుని నీరుగ్రమ్మిన కళ్ళ కద్దు కున్నాడు ఖాను.

"కార్యనిమగ్నులైయున్నారా? తేలికగాఉన్నారేమో అనుకున్నాను" అని పలుకుచూ మెరుపుతీగ లాంటి సుందరిఒకతె గదిలో ప్రవేశించి పరపురుషులున్నందున చప్పున వెనుకకుతగ్గింది. ఖాన్ గనీవైపు చూస్తూ "హహహ. ఏంతెలివి? తీరుబాటుగా ఉన్నాననుకొందిట. రాజప్రతినిధికి తీరికకూడానా?" అని ఒక వెడనవ్వు నవ్వేడు.

మళ్ళీ గదిగుమ్మమునైపుతిరిగి "హమీదా! రావచ్చును. పరాయివారెవ్వరూలేరు. ఈయన నీకాప్తుడే" అన్నాడు. అవనతవదనయై ఆయువిద లోనప్రవేశించింది.

"చూశావా? నన్ను మెచ్చుకుని పాదుషావారిచ్చిన బిరుదమూ" అని గర్వంగా ఆచిహ్న మావిడకి చూపించేడు ఖాను. కుశాగ్రబుద్ధియగు ఆమె అనర్హుడైన తనభర్త కిది ఎలాగునవచ్చివదియని పూర్తిగా అనుమానిస్తూనే "సంతోషము"అన్నది.

"ఓహో! మాఆవిడకుకూడా సంతోషమయింది. ఇంకేం—ఇదిగో మీఅన్నగారు అబ్దుల్ గనీ."

హమీదా నూతనపురుషునివైపొక్కసారి తలెత్తి వెంటనే వంచినది. ఆమెది చాలా పెద్దకుటుంబం. పాదుషాచే పంపించబడి తనబంధువువని చెప్పుకొనుచున్న యీవ్యక్తిని అనుమానించడం సుళువుకాదు. అయినా హమీదా గనీని బాగాఎరుగును. అందుచేత ఊరుకొనలేకపోయింది.

"గనీని నేనుబాగా ఎరుగుదును. కాని"—

"అవును మనమంతా చాందినీచౌకులో ఆడుకొనేవారంకదూ?" మాటమధ్య నింతచురుకుగా అందు కొన్నందునకామె ఆశ్చర్యపడి మళ్ళీ నిదానించిచూసి "కాని గనీకప్పుడు రాగిజుత్తుండెడిది."

"అయ్యో ఆమధ్యను చాలజబ్బుచేసి జుత్తంతయు నూడిపోయినది. మళ్ళీ ఆశ్చర్యంగా నల్లగా మెలు కత్తుకొచ్చింది."

"అయియుండవచ్చునుకాని గనీవి పిల్లికళ్ళు."

గనీ ఏదియో ప్రత్యుత్తరమియ్యబోతున్నాడు. ఖాను చురచుర చూస్తూ "ఆడదానికి నీకీతర్కం ఎందుకూ? పోయి భోజనం సిద్ధపరిపించు" అన్నాడు.

హమీదా చిన్నబుచ్చుకుంది. మరోమనిషి ఎదుట తన్నట్లు తూలనాడడం ఆమెకెంతో కష్టంతోచింది. బొటనవ్రేలితో నేలవ్రాస్తూ "స్త్రీలెన్నదీమాటరునని కొన్ని సంగతులుంటాయి."

"ఆహా! చాలా సంతోషించాం. నీసలహా కోరినప్పుడువచ్చి చెబుదుగానిలే. ఇంకిక్కడనుండి వెళ్ళవచ్చు."

హమిదా గిరుక్కునతిరిగి వెళ్ళిపోయింది.

గనీకండ్లనుండి జాలిగా రెండునీటిబిందువులు బుగ్గలపై జారేయి.

భోజనశాల బహుకోలాహలంగా ఉన్నాది. రహమాన్ ఖా నపరిమితసంతోషముచేత పరవశుడై తదను కూలంగా తప్పతాగుతున్నాడు. ఎదురుగా కూర్చొన్న గనీ గళ్ళాసులో కూడా కొంత సారాయముపోస్తూ "పాదుషా నాకీబిరుదిచ్చినందుకు సంతోషమేకాని మొన్న చేసిన సాహసంవింటే ఇంకా ఏంచేసునో?"

"ఏంచేశారేమిటి?"

"ఓడదొంగలలో మేటిరైన కదంబుడిపరివారాన్ని బంధించేశాను."

గనీ ఆత్రుతతో "చంపేశారా?"

"లేదు. అపనే చేద్దామనుకుంటున్నాను."

ఇంతలో ఒకమిత్రుడువచ్చి "ఖాన్ గారూ! మీకీబిరుదువచ్చినందులకు తగినవిధంగా వెల్లడిచెయ్యాలి నుమండీ" అన్నాడు.

"అదే అదే నేనూ అనుకుంటున్నాను. ఏంచేస్తేబాగుంటుంది."

"మాకందరికీ గొప్పవిందు చేయించండి."

గనీ అందుకున్నాడు "నాకుతోచినమాట చెబుతానువినండి. విందులవల్ల ఇదిబాగా వెల్లడికాదు. పూర్వం మహారాజులు తాము సింహాసనంఎక్కేటప్పుడుగాని దిగ్విజయంచేసినప్పుడుగాని ఖైదీలనందరిని విడిచి పెట్టేవారు. ఈద్వీపానికి మీరే సర్వాధికారులుగనుక మీరుకూడా ఈశుభసమయంలో అలాచేస్తేబాగుంటుం దని నానమ్మకం."

"అవును. ఇదే చాలాబాగుంది. డబ్బుఖర్చులేదు. మాటాదక్కుతుంది. కావలిస్తే వాళ్ళని మరో నేరంక్రింద మళ్ళీ శిక్షించవచ్చుకూడాను. కాని కదంబుడిపరివారాన్నివదిలితే ప్రమాదంవస్తుందండీ."

"దానికేమీపరవాలేదు. నేనొకచిన్నఉపాయం చెబుతాను. నేను వెంటనే పాదుషావద్దకు వెళ్ళి పోవాలి. లేకపోతే ఆయన కోపంచేస్తారు. నేను వెళ్ళేటప్పుడుగాని వీళ్ళను నాఅధీనంచేస్తే పాదుషాకు వీళ్ళని సురక్షితంగా అప్పజెప్పి మీకీర్తి పెట్టిస్తాను. నేను వీళ్ళను తీసుకుపోయినతరువాత మీరు ఖైదీలను కులాసాగా వదిలీవచ్చు.

"భేష్. ఏంఉపాయం చెప్పేవయ్యా. గనీ! తప్పకుండా యిలాగేచేదాం."

ఫలహారపుగదిలో ఖానూ, హమీదా, గనీ ముగ్గురేఉన్నారు. ఖాను తనఅదృష్టాన్ని తలుచుకుతలంచుకు పొంగిపోతున్నాడు. ఇంతలో ఏదోజ్ఞాపకంవచ్చి "మీఓడ ఎందుచేత భగ్నమయిందో చెబుతానన్నారు" అని గనీని ప్రశ్నించేడు.

"దానికేమిగాని ఒక ముఖ్యవిషయం చెబుదామనుకొంటూనే మరిచిపోతున్నాను. హమీదాబేగము నిజసోదరుడగు కరీమ్‌ను కదంబుడు బంధించేడు." హమీదా తృళ్ళిపడింది.

"కాని భయపడనక్కరలేదు. కదంబు డాతనిని సానురాగంగానే చూస్తున్నాడు."

"నాకు తెలియదూ? కరీమతిసులభముగా దొంగలతో సావాసముచేయగలడు. అవునా? హమీదా!"

"(కన్నీళ్ళతో) ఏమో నాకు తెలియదు."

"ఇపుడు కొంతధనమిచ్చినచో కరీమ్ విడుదలకాగలడు. మీరేమైన సహాయముచేయుదురని నమ్ముచున్నాను. కరీమ్‌కూడ చాలాదీనముగా ఈవిషయమై నన్ను ప్రార్థించినాడు."

"చాలుచాలు. ఇక్కడ నాకష్టార్జితమేకాని కరీమ్‌బాబుగారి సొమ్మేమియు దాచియుండలేదు. నేనిట్టి వాటికే సహాయమును చేయలేను. అన్నట్టు పాదుషావారికి నేను కృతజ్ఞతావందనములతో జవాబు వ్రాయవలసియున్నదికదా. నేను కార్యాలయమునకుపోవలెను. మిమ్ములను కొంతసేపు వదలవలసివచ్చినందుకు క్షమింపుడు" అని పలుకుచూ ఖానామందిరమువదలి వెళ్ళెను.

రుద్ధమయిన కంఠస్వరముతో హమీదా గనీనుద్దేశించి "నన్ను క్షమింపుడు. మీరు అబ్దుల్ గనీయన్న నమ్మకము నాకులేదు. కాని పాదుషాచే పంపబడినందున గొప్ప ఉద్యోగియనినమ్మగలను. ఇప్పుడు మీరు నాయనుంగుతమ్ముడగు కరీమ్‌నుగురించి చెప్పినది నిజమేనా?"

"సోదరీ! నీవు సరిగాపోల్చేవు. నేను గనీనికాను. కాని కారణాంతరాలవల్ల అట్లు నమ్మించవలసివచ్చింది. నేను మిమ్ములనువదలిన కొద్దికాలమునకే కరీమిచ్చటకువచ్చును. అతనన్నియు చెప్పగలడు."

"మీకు ధనమవసరమైనయెడల నానగలనిచ్చెదను. కాని వాడెట్లు కదంబునిచేజిక్కెను?"

"అదొక పెద్దగాథ. నేనూ అతనూ 'మకుటాజీ'అనే ఓడమీద ఇచ్చటకువస్తున్నాం. దారిలో కదంబు డడ్డుకొని వారియోడనాశనంచేసి మమ్మల్ని ఖైదుచేశాడు. నేనుమాత్రం వాడికళ్ళలో దుమ్ముకొట్టి అర్ధరాత్రివేళ సముద్రంలో గెంతేశాను. మరునాడిప్పుడు నేనువచ్చిన 'ఉదయపురి' అన్న ఓడ నన్నురక్షించింది. ఇదీ పాదుషావారిదేగవక ముందుగా ఇచ్చటకువచ్చి నాపనిపూర్తిచేసుకున్నాను. కరీముని విడిపించడాన్కి నాకు మీసొమ్మేమీ అక్కరలేదు. దైవము నాకూకొంత ఉపాధినిచ్చినాడు. నేనే అతనిని విడిపించెదను."

"నిర్హేతుకముగా మాకుటుంబముపై మీకుగలిగినదయకు వందనములు."

"నీవట్లనుకోనేవద్దు. కాని నిన్నుజూచిననే నాకు జాలియగుచున్నది. దుర్మార్గుడగు నీభర్తకు కాకిముక్కునకు దొండపండువలె—"

"ఏమంటిరీ? నాయెదుటనే నాదైవమునుదూరుదురా? క్షమింపుడు. ఇది మీకుతగదు."

"సోదరీ! నీపతివ్రతాత్వమునకు వందనాలు. నీవంటివారింకనూ కొందరుండుటవల్లనే ప్రపంచం నిలచియున్నాది. అచిరకాలంలోనే నీతమ్ముడిని నీవు కలుసుకోగలవు."

ఖాను గనీని వెంటబెట్టుకుని కారాగృహంవద్దకు వెళ్లినాడు. ఆప్రదేశమంతా భరించరాని కంపుతోటి, అపరిమితమైన చీకటితోటి నిండిఉన్నాది. ఒక్కొక్కఖైదినే పరిచారకులు ఇవతలి కీడుస్తున్నారు. అధమం వారంరోజులనుండైనా ఒకడికీతిండిఉన్నట్టులేదు. దృఢశరీరులైయుండిన అనుష్కరులిప్పుడు శల్యావశిష్టులైయున్నారు. వీళ్ళందర్నీ నోటికి వచించరాని దుర్భాషలాడుతున్నాడు ఖాను. గనీ కిదంతాచూచేసరికి కళ్ళంబడి నీళ్ళువచ్చేయి. "చావడాన్కి సిద్ధంగాఉన్న వీళ్ళ నింకాతిట్టడం ఎందుకండీ" అన్నాడు. "తిట్టాలా. పడేసి మట్టాలా. అమ్మమ్మా! వీళ్ళంటే సామాన్యులనుకొన్నారా ఏమిటి? మాపక్కలో బల్లెములే. ఒకొక్కళ్ళని పట్టడాన్కి ఏడుసముద్రాలూ ఏకమవాలన్నమాట."

అపరిమితంగావచ్చిన నవ్వు దాచుకున్నాడు గనీ. ఖైదీలనందరనూ ఒకచిన్నపడవలో ఎక్కించేరు. ఖానూ గనీ ఇంకోదానె ఎక్కేరు. కొద్దిదూరంలో ఎర్రపతాకపై తెల్లచంద్రవంకతో చూస్తూ "ఉదయపురి" నిరీక్షిస్తున్నాది.

ముందు ఖైదీల నెక్కించేశారు. తరువాత రాజప్రతినిధి ఎక్కడాన్కి నిచ్చెన దింపినారు. ఓడమీద వరకూకూడ దిగబెడితే మరీబాగుంటుందని ఖాన్ మెట్లెక్కి పైకెళ్ళినాడు. ఓడలోచూచును గదా ఒక్క మహమ్మదీయనావికుడూ అగుపడడు. ఖానుకనుమానంతట్టింది. ఇంతలో లోనుండి కదంబునికీ జేయని పెద్దగొల్లు వినిపించింది. సాయిబుగారి గుండెల్లో బండరాయి పడేసినట్లయింది. గనీకోసం వెనకతిరిగి చూశాడు. ఇంకా గనీ ఎక్కడ? గనీ దుస్తులలో కదంబుడే ప్రత్యక్షం. ఖానుకంతా అర్థమయింది. వళ్ళు వణుకుపుట్టింది. నాలిక తడి ఆరిపోయింది. కొయ్యబొమ్మలాగు నిలబడిపోయాడు.

"కరీమ్!" అన్నాడు కదంబుడు. ఒకగదిలోనుండి చిరునగవుతో కరీమివతలకువచ్చేడు.

"మీ బావగారితో ఇంటికివెళ్ళిపో. ఇప్పటినుండేనా ఆయనను మీఅక్కయెడల దయగలిగియుండమను. లేకపోతే నల్లగుండెల్లో నిద్రపోతానని జ్ఞాపకంచేయి. మరివెళ్ళిపో. మాఓడలంగరు ఎత్తివేశాం."

చెవులు చిల్లులు పడేటట్లు ఓడ కూతవేసినది. నిశ్చేష్టుడయిన ఖానునీ, కరీముని దోనెలోకి దించేరు. నౌక నవనగరతీరాన్ని వదలిపెట్టేసింది.

ఇంటికొచ్చేసరికి పూర్తిగా తెలివొచ్చింది ఖానుకి. కళ్ళువిప్పేసరికి ఎదురుగా కరీమ్, హమీదా లవుపడ్డారు. వెంటనే ఒళ్ళుమండిపోయింది. కళ్ళుచింతనిప్పు అయిపోయాయి.

"నీతమ్ముడు ప్రతాపంచూశావా? దొంగవెధవతో సావాసంచేసి కష్టపడిపట్టిన ఖైదీలను నాచేతనే విడిపించేడు."

హమీదా:—దొంగవెధవెవరూ?

ఖాన్:—వాడే, నిన్ననువచ్చి బిరుదమునిచ్చిన గనీయే.

కరీమ్:—ఆబిరుదు నీకాయిచ్చేడు. బలే ఏంసాహసం!

ఖాన్:—ఏమిటలాగంటున్నావు.

కరీమ్:—బావగారి తెలివికి ఆశ్చర్యపడుతున్నాను. నీవేమిచేశావని నీకాబిరుదిచ్చేరని పుచ్చుకున్నావు. అది నవసారప్రతినిధి రసూల్ ఖానుది. పాదుషావారి అజ్ఞలపైనేనది వానికొరకు తీసికొనిపోవుచుండగా నన్ను బంధించి నావలన అన్నిసంగతులను గ్రహించి కదంబుడొచ్చిన మాయయిది.

ఖాన్:—ఆ ఆ ఇంతద్రోహమా. ఆఖరికి బిరుదుకూడా నాదికాదూ? ఛీ నువ్వు కూడబట్టే వాడింత సాహసంచేయగలిగేడు. వాడట్టులే గనీ అనిచెప్పుకుంటూఉంటె హమీదాఏనా అనుమానించలేదు.

హమీదా:—నేనప్పుడే అనుమానించేను.

ఖాన్:—పోల్చుకునే ఇంతపనీచేశావూ భ్రష్టా! నాతో చెప్పవద్దూ.

హమీదా:—నన్ను చెప్పనిచ్చేరా? నేననుమానిస్తూంటే కసిరి అవతలకి పొమ్మన్నారు కదూ? అనవసరంగా మీచేత చివాట్లెందుకు తినడం అని నోరుమూసుకూరుకున్నాను.

ఖాన్:—ఏడవలేకపోయినావు. తెలివితక్కువ మొద్దు. మీరిద్దరూ శనిగ్రహాల్లాగ దాపరించేరునాకు. పొండి అవతలకి. మీమొహంచూస్తే అసహ్యంవేస్తున్నాది.

కరీమ్:—బావా! కదంబుడిమాటలు మరచిపోయినావేమిటి? దయగాచూడకపోతే నల్లగుండెల్లో నిద్రపోతాడట సుమా!

ఖాన్:—అసే మీయిల్లు బంగారంగానూ! ఇదొకటా నాప్రాణంమీదికి. సరే.